
# త్యాగాలు - రాగాలు

రచన : శ్రీ ఎన్. లక్ష్మీనారాయణ, బి.ఏ.



'ఉషా, ఆ చెట్టు మీది పావురాలు ఏమనుకుంటున్నాయో చెప్పగలవా?' రాంబాబు దరహాసవదనంతో అడిగాడు: ఈ మాటలతో ఉషకు ఎందుకో గానీ ఎక్కడలేని సిగ్గు పుట్టుకొచ్చింది; లేత గులాబీ రేకులవంటి ఆమె చెక్కిళ్లు ఎర్రబడ్డాయి: తన ముఖాన్ని క్రిందికి దించి ఆమె అతి కష్టంమీద 'ఉహూఁ' అని అంది:

'ఐతే నే చెప్పనా?'

'ఊఁ'

'మరే: ఉషా అవి ఇప్పుడు ప్రణయకలాపం సాగిస్తున్నాయి: మరో విశేషమేమిటంటే మనం ఇప్పుడు ఎల్లాగైతే ఆ పావురాల మాట ప్రస్తావిస్తున్నామో, అల్లాగే అవికూడ మన విషయం మాట్లాడుకుంటున్నాయి'

'అల్లాగా' అంది ఉష, బొత్తిగా తనకేమీ తెలియనట్టు: 'అవును; నా మాటలు వింటోంటే నీకు ఆశ్చర్యం వేస్తోంది కదూ: పోనీ నీవే చెప్పు, మనకుమల్లే వాటికీ అభిప్రాయాలు, ఆదర్శాలు ఆశలు, ఆనందాలు, అనుభవాలు, అనుభూతులూ, అవీ ఇవీ ఉండకుండా ఉంటాయా? పోతే వాటి ప్రేమకు దుష్టశక్తులేవీ అడ్డురావు: మరి మానవుల విషయం అల్లాకాదు: సంఘంలో కులగోత్రాలు, అంతస్థుల అంతరాలవంటి కొన్ని కొన్ని కట్టుబాట్లు, పట్టింపులు పవిత్ర ప్రేమను చుట్టుముట్టి పీడిస్తాయి.

'మన ప్రేమను అడ్డగించే శక్తులేవీ లేవుగా' ఉష చిరునవ్వు నవ్వుతూ చిన్నగా అంది కాస్త ధైర్యంగా: ఆమె పలుకుల్లో ఒక విధమైన మాధుర్యం తొణికిసలాడింది:

'అందుకు మనం అదృష్టవంతుల మనుకోవాలి' అన్నాడు. రాంబాబు అప్రయత్నంగా ఉషను దరికి తీసికొంటూ: ఉష రాంబాబు ప్రయత్నాన్ని నివారించలేదు: వారి పవిత్ర ప్రేమకు తాము సాక్ష్యాలన్నట్టుగా చెట్టుకొమ్మమీది కపోతాల జంట తెల్లటి తమ రెక్కలను రెప రెప లాడిస్తూ టప టప శబ్దంతో మరో కొమ్మమీదికేగిరాయి: చల్లటి పిల్లగాలులు ఏకమైన ఆ రెండు హృదయాలను మెల్లగా స్పృశించాయి: ఆ పార్కులో దీపాలు వెలిగి అప్పుడప్పుడే ఆ ఉభయుల చుట్టు ముసురుకొన్న చిరుచీకట్లను దూరతీరాలకు పారద్రోలాయి:

ఆ నాటికి ఆ రెండు ప్రేమలతలూ విడివడక తప్ప లేదు;

పుట్టినప్పుడే తల్లిని కోల్పోయినా, తండ్రికి ఒక్కగానొక్క నలుసైన రాంబాబు బి. ఏ. ఫస్టు క్లాసులో పాస్తే పట్టుమని పాతికేళ్ళు నిండకుండానే ఉన్నఊరిలో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం సంపాదించాడు: ప్రతి విషయంలోనూ ధైర్యంగా, సూటిగా వ్యవహరించటం వల్లనూ, ఉద్యోగ ధర్మ నిర్వహణలో కన్నిటికి

తావు లేదనటం లాంటి ఉన్నతాభిప్రాయాలు కలిగుంటం వల్లనూ, అనతికాలంలోనే అటు అధికారుల, ఇటు ప్రజల ఆదరాభిమానాలను అమితంగా చూరగొన్నాడు: అట్టే ఆస్తిపాస్తులులేక పోయినా ఉన్న ఒక్క ఇల్లు, ఉద్యోగంలో పది మంది మధ్య పరువు ప్రతిష్ఠలను పేం పొందించుకున్నాడు: గొప్పగా లేనివాడనే చిన్న చూపుతో భూస్వామి లోకయ్య తన ఒక్కగా నొక్క కూతురు ఉషను రాంబాబు కివ్వకూడదని మొదట్లో నిశ్చయించుకున్నా ఉష అభిప్రాయాలను, రాంబాబు పట్ల ఆమెగాఢానురాగాన్ని అర్థంచేసుకోగానే ఆయన తన ఉద్దేశ్యాన్ని పూర్తిగా మార్చుకున్నాడు. చిన్నతనంలో తల్లిదండ్రులు నిర్దేశించిన అమ్మాయిని తాను చేబట్టాడన్న మాటే కానీ, ఈ రోజుల్లో ఈ ప్రేమ వివాహాలు పరిపాటవటంవల్ల తామూ కాలాను గుణ్యంగా వ్యవహరించాలనీ, అందువల్ల 'ఫలానావాడిని' పెళ్ళి చేసుకోమని తన కుమార్తెను ఆదేశించటం అర్థవంతమైన పని కాదనీ లోకయ్య శీఘ్రగతిన అర్థం చేసుకున్నాడు. అందువల్లనే అధునాతనాభిరుచులకు నీడకల్పిస్తూ, చివరకు ఎల్లాగైతేనేం తన ముద్దుల కుమార్తెను రాంబాబుకు దత్తం చేయటానికి నిశ్చయించుకున్నాడు: పోతే ముహూర్తం నిశ్చయించటమే తరువాయి!

మంచికీ, చెడుకూ, దేనికైనా కాలం, కర్మం కలసి రావాలన్నారు: కలసి వచ్చిందికాలం: నిశ్చయమైంది వివాహం: రెండు కుటుంబాలవారికీ అదో సంబరం: ఆనందం; వివాహానికి మరో మాసం వ్యవధి ఉంటంవల్ల ఇరుపక్షాల వారు నెమ్మదిగా ఏర్పాట్లు చేసికొంటున్నారు. సాగరంలో ఒక దానివెంట వెళ్ళే మరో కెరటంలా, రోజులు ఒక దాని నొకటి అనుసరించి సాగిపోతున్నాయి: వివాహానికి మరో పది రోజులుంది: ఎల్లాంటి తొట్రుపాట్లు లేకుండా ఆ రాత్రి గడచిపోయింది:

అది మరుసటి రోజు ఉదయం: అహస్కరుడి అరుణ కిరణాలు క్రమంగా తీక్షణ రూపం దాలుస్తున్నాయి: గోడమీది గడియారం తొమ్మది గంటలు కొట్టింది: రాంబాబు ఇంటి ముంగిట 'పోస్ట్' అన్న కేక వినిపించింది: రాంబాబు తండ్రి శివరామయ్య కవరు అందుకొని తీసుకెళ్ళి కొడుకు చేతికిచ్చాడు: కవరు చించి ఉత్తరం చదివాడు రాంబాబు: చదువుతున్నప్పటి మాటఎల్లా ఉన్నా

(52వ పేజీ తరువాయి)


పిల్లి ఎప్పుడు క్రిందపడ్డా నాలుగు కాళ్ళూ నేలమీద మోపుతుంది. దూకేటప్పుడు పంజాలు, తోకనూ ఒక చోటుకి చేర్చి ఉంచుతుంది. నాలుగు పంజాలు విప్పి కాళ్ళు క్రిందకు వాల్చిందో దూకుడు అగుతుంది.

వాటి గ్రహణ శక్తి చాలా పదునయినది. పిల్లి నాడీమండలం చురుకుగా పనిచేస్తుంటుంది. పిల్లి మీసాలే కాదు, ఒంటిమీద బొచ్చుకూడా శబ్దాన్ని కనిపెట్టే శక్తి ఉన్నది.

మానవుడికీ, పిల్లికీ ఉంటున్న సంబంధాలను కొందరు మనస్తత్వ వేత్తలు పరిశోధించి, మనుషులలో పిల్లులను ప్రేమించేవారు కొందరు, కుక్కలను ప్రేమించేవారు కొందరూ ఉంటున్నారని తేల్చారు. పిల్లులను ప్రేమించే మనుషులు అంత సత్తువ లేని వాళ్ళని ఈ విజ్ఞాన శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. మరి కార్డినల్ రిష్లూమాట ఏమిటి? ఆయనను మీరు ఎట్లా నిందించాలనుకున్నా నిందించవచ్చును. కానీ అశక్తుడననాటికి ఆస్కారం లేదు. కానీ ఈ శాస్త్రజ్ఞులన్నారు పిల్లలు ఆయన గదిలో ఆడుతూ ఉండకపోతే ఆయన పూచికపుల్ల ఎత్తు పనికూడా చెయ్యలేక పొయ్యేవారని.

లెక్కలను బట్టి పెంపుడు పిల్లలు, ఏటా సగటున ఒక్కొక్కటి 600 ఎలుకలను, 4పక్షులనూ చంపుక తింటుందని తేలింది.

["విజ్ఞాన శాస్త్రం, జీవితం" అన్న పత్రిక 1963 రెండవ సంచికనుండి.]



Telegram : "LITHOGRAPH" Telephone ; 58 & 75

**THE NATIONAL LITHO PRESS**

(Estd. 1933)

RAILWAY FEEDER ROAD, Post Box No. 30 SIVAKASI, (S.I.)

దక్షిణ భారతంలో ఖ్యాతిగాంచిన ముద్రణాలయం!!

ది నేషనల్ లితో ప్రెస్ - శివకాశి.

నిపుణులైన పనివారలచే, మా ప్రెస్‌లో అందమైన విధంగా అగ్గి పెట్టె, బీడి, మిల్, సోప్ ఫైర్ వర్క్సు, బట్టలు, కాఫీ, టీ, మిఠాయి, సోడా, మొదలయినవాటికీ కావలసిన లేబిల్సు, మరియూ పెట్టెలు, లితోలోను, ఆఫ్‌సెట్‌లోను అచ్చువేసి ఇవ్వబడును. చిత్రాలుగల కాలెండర్లు "ఫోటో ప్రాసెస్" మూలంగాను ఆఫ్‌సెట్ పద్ధతిలోనూ తయారుచేసి ఇవ్వగలము

ఆకర్షణీయమైన పలురంగులలో, పువ్వుల బార్డర్లలో పల వివాహమహోత్సవాహ్వాన పత్రికలు రెడీమేడ్‌గా మావద్దనున్నవి.

ముద్రణాలయములకు కావలసిన లితో, ఆఫ్‌సెట్ ఇంకులకు:—

గిరిశెన్ ప్రింటింగ్ ఇంక్ ఫ్యాక్టరీ - శివకాశి,

వారికి వ్రాయండి.

చదివిన మరుక్షణంలో అతని ముఖంలో రంగులు మారాయి: రకరకాల ఆ రంగుల్లో సంతోషం, విచారం, ఉత్సాహం, ఉద్వేగాది మానవ సహజ లక్షణ రూప స్వరూపాలు స్పష్టంగా ప్రతిఫలించాయి: ఇవేవీ అవగాహన కాని శివరామయ్య మెల్లగా 'ఏమిటి నాయనా?' అని అడిగాడు: కొడుకు వాలకం అతని మెదడుకు మేత వేసింది.

'నాన్నా మరేమీ లేదు: ఈశాన్య సరిహద్దుల్లో మన దేశానికి చైనాదేశానికి జరుగుతున్న సమరం తీవ్రరూపం దాల్చింది. మన దేశరక్షణకు కేవలం ధన కనక వస్తు వాహనాలేకాక సైన్యం కూడ అవసరమైంది: అందుకోసం తుపాకులవంటి ఆయుధాలను చేపట్టటంలో అనుభవంగలవారినందరినీ రమ్మని కబురంపుతున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ మహోద్యమంలో పాల్గొనమంటూ నాకూ ఓ పిలుపు వచ్చింది: నాన్నా నా జీవితంలో ఇదోమలుపు' అన్నాడు రాంబాబు; అతడి హృదయంలో ఆవేశం కరడు గట్టింది: ముఖంలో ఉత్సాహం ఉదయించింది:

ఈ మాటలు వినగానే శివరామయ్య గతుక్కుమన్నాడు: 'అదేమిట్రా, నీ వాలకం చూస్తొంటే యుద్ధమంటే ఒక బొమ్మలాటలా, భావిస్తున్నట్టగుపిస్తోంది; తాడో పేడోనని తేల్చుకోటమే యుద్ధం: దేశంలో లక్షలాది ప్రజలుండగా యుద్ధంలో పని చేయ్యటానికి నీవే అగుపించావా? వద్దు నాయనా; ఒక్కగా నొక్కడివి: లేక లేక కలిగావు: వెళ్ళకు: కావాలంటే ఉద్యోగం వదిలేయి'

నాన్నా నా మీది మమతచే నీ వల్లా అంటున్నావు కానీ అల్లా అనటంలో నీవు చాల పొరబడుతున్నావు. యుద్ధమంటే బొమ్మలాట కాకపోవచ్చు: అల్లా అని మన ప్రయత్నం మానుకోటం కంటే పిరికితనం కానీ, దేశద్రోహం కానీ మరొహటుండదు: స్వార్థం, ఆత్మస్తుతి, పరనింద, అన్నవి చాల హేయమైనవి: అవి గర్హనీయమైనవి కూడ: అవి ఎంతటి అనర్థకాలనైనా దారితీయటమే గాక, మనుష్యుల్లోని మానవత్వపు విలువల పరిమాణాన్ని నిర్ణయించే కొలత బద్దలుగా అవి పని చేస్తాయి: స్వార్థత్యాగం వల్ల ఎంతటి మహోత్కృష్ట

కార్యాన్నైనా అవలీలగా సాధింపవచ్చు: నాన్నా నాకు జ్వరం వచ్చిందనుకో: తద్వారా చావుబ్రతుకుల మధ్య పెనుగులాడుతున్నాననుకో: నన్ను బ్రతికించుకోటానికి నీ సిరసంపత్తులే కాదు, సర్వం త్యాగం చెయ్యటానికి సిద్ధపడతావు. అంటే నామీద నీ కెల్లాంటి ప్రేమ ఎల్లా ఉంటుందో అల్లాగే మనకు మన దేశంమీద అంతకు మించిన ప్రేమ ఉండాలి: 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అని మహాకవి హెచ్చరించారు. దేశం లేకపోతే మనమూ లేనట్టే; మన దేశానికి ఆపద వాటిల్లిందంటే, దాన్ని రక్షించుకొనే బాధ్యత మన భుజస్కందాలమీద ఉందనే విషయం మరువరాదు. 'నన్ను ముట్టుకోకు నా మాలకాకి' అన్న తత్వంతో దేశంలో "నేను వెళ్ళకూడదు" "నా అవసరం లేదని" ప్రతి ఒక్కరూ దూర దూరంగా ఉంటే దేశంగతేమయ్యేట్టు? నాన్నా నీవేమి కంగారుపడకు; ప్రభుత్వోద్యోగంలో ఉండనీ, ఉండకపోనీ ఆపదల్లో చిక్కుకున్న సమయంలో దేశాన్ని రక్షించుకొనే బాధ్యత ప్రతిఒక్కరిమీద ఉంది; కనీసం కుటుంబానికి ఒక్కరైనా ఈ ఉద్యమంలో పాల్గొనాలి. నేను ఎల్లుండి బయలుదేరుతాను: నన్ను అడ్డుపెట్టకు."

శివరామయ్యకు ఏమి మాటాడాలో తోచలేదు; కలతచెందిన గుండెతో "నీఇష్టం నాయనా" అని అక్కడనుండి వెళ్ళిపొయ్యాడు: చేతి గడియారం చూచుకొని ఆఫీసుకు బయలుదేరాడు రాంబాబు.

రెండు రోజులు గడిచాయి: ఆరోజు సాయంత్రానికల్లా పెట్టె బెడ్డింగులతో రాంబాబు ప్రయాణమయ్యాడు: చివరిసారిగ లోకయ్య దంపతులకు వందనాలు తెలిపి తన గదిలో ఏకాంతంగా కూచున్న ఉషను మరోమారు కలసి "వెళ్ళొస్తా ఉషా" అని అన్నాడు; ఈ పలుకులు వినిపించగానే ఉషకు ఎక్కడలేని దుఃఖం పొర్లుకొచ్చింది. సోఫాలోనుండి లేచివచ్చి "రామూ" అని అతని హృదయం మీద వాలిపోయింది.

"రామూ, ఎందరు ఎన్నివిధాల చెప్పినా నీవునీ ప్రయత్నం విరమించుకోటం లేదు; ఎక్కడ యుద్ధం? ఎక్కడ నీవు? జీవితంమీద ఏ కోశాన ఆశ లేకుండా, ముందు వెనుకలు ఆలోచించకుండా ఇల్లా తెగించి సాహసించటం బాధాకరమైన విషయం: కర్తవ్య పరాయణత్వం నీ వొక్కడివేనా ఆచరణలో అమలు జరపాల్సింది; యుద్ధం చెయ్యటానికి ఎందరు లేరు?"

"ఉషా, అనవసరంగా తపనచెందకు; అంతా అందలంలో కూచోవాలనుకుంటే మరి దాన్ని మోసేవారెవరు? అంతా యుద్ధాన్ని తప్పించుకోవాలనుకుంటే దేశ రక్షణకు పూనుకొనే వారెవరు? వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. ఇక నా నిశ్చయానికి తిరుగులేదు; పోతే ఆనందంతో కలకలలాడే నీ ముఖారవిందాన్ని ఒక్కమారు చూడాలనుంది."

రాంబాబునుండి ఈ మాటలు వినిపించగానే వర్షములో ఎండలా, కన్నీటిధార లగుపిస్తున్న ఉష ముఖపద్మంలో హఠాత్తుగ ఆనంద రేఖలు పొడసూపాయి: కానీ ఆ ఆనంద రేఖల నీడల్లో దాక్కున్న విషాదమూ అగుపించక పోలేదు; "నాణానికి బొమ్మ, బొరుసుల్లా, జీవితానికి ఆనందం, విషాదం, ఈ రెండూ అవసరమే: ఏది లేకపోయినా జీవితం అంత రుచికరంగా ఉండదేమో" అని తలపోశాడు రాంబాబు ఆ క్షణంలో;

"ఉషా, ఇంకా బాధపడుతున్నావు కదూ?"

"లేదు, రామూ! సమరంలో విజయలక్ష్మిని చేబట్టి నీవు క్షేమంగా వీలయినంతత్వరలో తిరిగి రావాలని, అందుకు మిమ్ములను ఆశీర్వదించమని సంతోషంగా భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. మరి, రామూ త్వరగా తిరిగి వస్తావుకదూ?"

ప్రశాంతంగా ప్రవహించే నదీ జలంలో సుడిగుండాలు చెలరేగినట్టు, ఆ పలుకులకు నిశ్చలమైన రాంబాబు కళ్ళలో నీళ్ళు దిరిగాయి; అతని జీవితంలో అదో మధురానుభూతి; "అల్లాగే ఉషా! వీలయినంత త్వరలో నే తప్పకుండా తిరిగివస్తాను: నిన్ను విడచి నేనుమాత్రం ఉండగలనా? వెడతా" అని అంటూ పెద్ద పెద్ద అంగలతో ఆ ఇంటి గడపదాటి బయట పడ్డాడు రాంబాబు: అతడి హృదయంలోని ఆవేదన శిఖరాగ్రాల నధిరోహించింది; తిన్నగా ఇల్లు చేరుకున్నాడు; అప్పటికే సామానంతా జట్కాలో చేర్చబడింది; రాంబాబు రాకతో జట్కా కదిలింది; తండ్రీ కొడుకులు స్టేషన్ చేరుకొన్నారు: రైలు రావటంతోనే రాంబాబు బండి ఎక్కి కూచున్నాడు; కొంతసేపటికి రెక్క వాలింది; రైలు అరచింది; "వెళ్ళొస్తా నాన్నా" అన్నాడు

రాంబాబు, అంతర్గతంగా కుమిలిపోతున్న తన తండ్రి పరిస్థితిని చూచి అతని గుండె తరుక్కుపోయింది; "మంచిది నాయనా; వెళ్ళగానే ఉత్తరం వ్రాయి భగవంతుడే నిన్ను కాపాడుతాడు;" అని అన్నాడు శివరామయ్య; అతడి చివరి పలుకులు ఇంజన్ భుగభుగ మని వదలిన పొగ సవ్వడిలో కలసిపోయ్యాయి; అయిన వారికి దూరమౌతున్నానన్న ఆరాటం కొద్దీ రాంబాబు గుండె భగభగ మంది; రైలు వెళ్ళిపోయింది; కనుచూపు మేరవరకు అగుపించిన రైలుబండికి మరోమారు మనసులో వీడ్కోలిచ్చి గృహోన్ముఖుడయ్యాడు. అతను మెల్లగా ఇల్లు చేరేసరికి ఊరిలో దీపాలు వెలిగాయి:

ఆ రోజుకు సరిగ్గా పక్షం రోజుల తరువాత కొడుకు వద్దనుండి శివరామయ్యకో ఉత్తరం వచ్చింది: అందులో తాను క్షేమంగా చేరినట్లు, ఉద్యోగంలో ప్రవేశించినట్లు, యుద్ధం కొంత తీవ్రంగానే సాగుతున్నట్లూ, విజయలక్ష్మి ఎప్పుడు ఎవరిని వరిస్తుందో అప్పటికప్పుడే చెప్పటం వీలుకాదన్నట్లు తెలియజేశాడు రాంబాబు: కాగితం ముక్కను కళ్ళకద్దుకొని, తన కొడుకును కాపాడమని కంఠమెత్తి కోటి దేవుళ్ళను కోరుకున్నాడు శివరామయ్య: అతడు ఉత్తరాన్ని దేవునిగూటికి క్రిందనే ఉన్న చిన్న గదిలోని పెద్ద పెట్టెలో భద్రంగా దాచుకొన్నాడు: ఆ రోజుననే ఉషకూ ఓ ఉత్తరం వచ్చింది; "ఉషా! ఇక్కడ నేను ఉద్యోగంలో చేరి శత్రువుల మీదికి ఒక దళాన్ని నడుపుతున్నా; యుద్ధ తీవ్రత తగ్గినపుడూ, రాత్రులందు యావత్ప్రపంచాన్నీ నిశి పాలించే నిశ్శబ్ద వాతావరణంలోనూ నీవు నా స్మృతిపథంలో ప్రత్యక్షమౌతూనే ఉంటావు: అనవరతం అంతరిక్షంలోని విమానాల రొదలు, అంతంకానని తుపాకి గుండ్ల సవ్వడి అంగవికలుల బాధలు, మూల్గులు, మినహా మరేమీ వినిపించని నాకు కొద్దిపాటి ప్రశాంత సమయాల్లో నన్ను పిలుస్తూ కమ్మని నీ కంఠస్వరం వినిపించినట్లనిపించినపుడు ఏనదోగకమైన హాయి ననుభవిస్తుంటాను; నీ ముగ్ధ మోహన సౌందర్య స్వరూపాన్ని తలచుకొన్నపుడెల్లా నేను మంచుకొండలా మారి



పోతుంటాను: ఈమారు నీదరి చేరటం నా జీవితంలో మరో మరపురాని మధురానుభూతి కాగలదు: ఆ సమయంకోసం ఎదురుచూస్తూ.'

ఇట్లు
రాంబాబు;

ఉత్తరం చదువుకొని ఒక్క నిట్టూర్పు విడచి ఆమె అల్లాగే కుర్చీలో కూరుకుపోయింది. అల్లా ఎంతసేపు గడచిందో కానీ తిరిగి ఈ లోకంలో పడగానే, రాంబాబుకు ఉత్తరం వ్రాయటానికి ఆమె కలమూ, కాగితమూ తీసుకొంది:

"ప్రియమైన రాముకు,

అవ్యాజమైన నీ ప్రేమను ఒక్కుమ్మడిగా గుప్పిస్తూ నీవు వ్రాసిన లేఖను చదువుకున్నాను: ఉక్కిరిబిక్కిరయ్యాను; మరీ మరీ చదువుకున్నాను: మనసార ఆనందించాను: తనివితీరా చదువుకున్నాను: ఎంతో మురిసిపొయ్యాను.

మీరు మమ్మల్ని వదలి వెళ్లాక ఇక్కడ నాకు రోజులు సంవత్సరాల్లా గడుస్తున్నాయి: ఏపని చేస్తున్నా అందులో మీ రూపం నాకు లీలగా అగుపిస్తూనే ఉంటుంది: హఠాత్తుగా మీరు అంతదూరం వెళ్ళిపోవటంతో ఇటీవల మీ ప్రతిరూపం కొంత స్పష్టంగా అగుపించినట్లు, ఒక్కమారు నిజంగా మీరే ఇక్కడ సాక్షాత్కరించినట్లగుపిస్తుంది; ఏది ఏమైనా మీ దర్శన భాగ్యం కొరవడ్డ ఇప్పటి నా బ్రతుకు చంద్రుడు లేని రాత్రిలా వెలవెల బోతోంది: యుద్ధంలో అంతిమ విజయం మనదే:

వసంతాగమనం కోసం వీక్షించే కోయిలలా, మీ రాక కోసం నేను వేయి కన్నులతో ఎదురుచూస్తుంటాను.'

ఇట్లు
మీ ఉష.

ఉత్తరాన్ని పోస్టు చేయించింది రాంబాబుకు: అప్పటికామె మనస్సు కొంత స్థిమిత పడింది:

ఆ మాసంలోనే ఉషకు రెండు మూడుత్తరాలొచ్చాయి: తరువాత మూడు మాసాలు గడచాయి. రాంబాబునుండి ఆమె కెల్లాంటి జాబులూ రాలేదు: వ్రాసిన ఉత్తరాలకు జవాబులు బొత్తిగా రాకపొయ్యేసరికి కారణాలూహించలేని ఉష తరచు శివరామయ్యమామయ్య నడిగేది; మూడు మాసాలనుండీ తనకూ ఒక్క ఉత్తరం ముక్కయినా రాలేదని ఆయనకూడా కుమిలిపోతూ పలికేవాడు: ఆ దిగులుతోనే ఆయన సగం అయ్యాడు: రోజూ వార్తాపత్రికల్లో యుద్ధం తీవ్రంగా సాగిపోతోందనే వార్తలు మటుకు తాటికాయంతటి అక్షరాల్లో అగుపిస్తూ వచ్చేవి; రోజులు అల్లాగే గడచిపోతున్నాయి; ఆరోజు అనుకోకుండా శివరామయ్యకో ఉత్తరం వచ్చింది; విప్పి గబగబ చదివాడు; చదవటంతోటే "నాయనా రాంబాబూ" అని అరచి నేలగూలాడు; ఆ అరుపుతో ఇరుగుపొరుగువారుపరుగెత్తుకువచ్చి శైత్యోపచారాలు చేసి ఆయన్ను మంచంమీదికి చేర్చారు; ఉత్తరంలో అధికారులు వ్రాసిన విషయాన్ని బట్టి రెండు మాసాలక్రితం రాంబాబు సమరంలో దారుణంగా గాయపడి హాస్పిటల్లో చేర్చబడ్డట్టు, వారం రోజులక్రితం విగతజీవుడైనట్టు తెలిసింది: ఆ వార్త అప్పటికప్పుడే ఊరంతా ప్రాకిపోయింది: శివరామయ్యను ఓదార్చటానికి ఆయన ఇంటిముందు జనం గుంపులు గుంపులుగా ప్రోగయ్యారు: ఉష ఆవేదనకు ఆనకట్టలు లేకపొయ్యాయి; దుఃఖంతో కుమిలి కుమిలి రెండు రోజుల్లో ఆమె పూర్తిగ నీరసించింది. ఆమె ముఖంలో కళ అనేది అంతరించింది: తల్లిదండ్రుల ఓదార్పు మాటలతో కాలం కదిలేకొద్ది క్రమంగా ఆమె కొంతకు కొంత మామూలు మనిషిగా మారగలిగింది:

ఇప్పుడామె కేవలం పుస్తకాలు చదవటంలో కాలాన్ని వెళ్ళబుచ్చుతోంది. ఏ విషయంపట్ల ఆమె అంత ఆసక్తిని అగపరచటం లేదు. ఎప్పుడైనా రాంబాబు స్ఫురణకొస్తే టప టపమని నాలుగు కన్నీటిబొట్లు రాల్చేది; ఏవైనా పెళ్ళి సంబంధాలు వస్తే పెళ్ళి అసలుకే అక్కర్లేదని తల్లిదండ్రులను ఘర్షణ పెట్టుకొనేది, కానీ నయంగా వారు చెప్పే మాటలవల్ల ఆమె కాస్త మెత్తలుదేది: ఎల్లాగైతేనేం లోకయ్య దంపతులు కూతురుచేత ఒక సంబంధాన్నొప్పించగలిగారు; దీపావళి తరువాత ఎనిమిదో రోజున ముహూర్తం నిశ్చయమైంది: చూస్తూండగానే దివ్వెశోభ నొలికిస్తూ దీపాల పండుగ రానేవచ్చింది: దీపావళి నాటి సంధ్యవేళ ఊరంతా మతాబాల కాంతితో, సిసింద్రీల వెలుగులతో అందాలవొలికిస్తూ, మధ్య మధ్య సీమటపాకాయల ధ్వను

లతో కోలాహలం చేస్తోంది: ఇంట్లో ముందుగదిలో కూచుని నవల నొకదానిని చదవటంలో నిమగ్నురాలైన ఉష చదువుతున్న అధ్యాయం ఐపోగానే పుస్తకం మూసి, టేబుల్ మీదుంచి, గడప దాటి బయటికి వచ్చి నిల్చుంది: వీధిలో ఒక చోట నిప్పంటించబడ్డ చిచ్చుబుడ్ల రవ్వలు ఒక దాన్ని మించి మరొకటి ఆకాశాన్నంటుకోటానికి పోటీ బడుతున్నట్లగుపించాయి: మరో చోట నేలమీద రవ్వలను గుండ్రంగా వెదజల్లుతూ కాలిపోతున్న 'భూచక్రం' చూడముచ్చటగా అగుపించింది: వీటన్నిటి మధ్య 'గుంయ్యి' మన్న శబ్దంతో తరచు విమానాలు అంతరిక్షాన్ని మూసుకు పోతున్నాయి ఉన్నట్టుండి పొరుగింటి ముంగిట 'ఢాం' అని ప్రేలిన పెద్ద టపాకాయల శబ్దానికి ఉష కళ్ళు బైర్లుక్రమ్మాయి: ఆమె వెంటనే క్రిందపడిపోయింది, మెలకువ వచ్చేసరికి ఆమె హాస్పిటల్‌లో చేర్చబడుంది: కలలోనైనా ఊహించని విధంగా జరిగిన ఈ సంఘటనకు లోకయ్య దంపతులు పరిపరి విధాల తపించారు; ఎనిమిది రోజులున్న పెళ్ళిని గూర్చి వారు కలవరపడ్డారు: అప్పట్లో ఇక చేయగలిగిందేమిటో తోచక మిగిలిన భారాన్ని భగవంతుడి మీద వేశారు.

కాలచక్రం భ్రమిస్తోంది: అందులో ఆరుమాసాలు అవలీలగా దొర్లిపోయాయి:

ఒక రోజు ఉష తన గదిలో ఏకాంతంగా కూచుని ఆలోచిస్తోంది: కొంత సేపటికి ఓ చిన్న సీసాలోనున్న ద్రావకం ఏదో గడగడమని రెండు గుటకలు త్రాగింది: వెంటనే ఏదేదో తలచుకొని పిచ్చిదానికి మల్లే తనలో తాను నవ్వుకొంటోంది:

'ఉషా' అన్న కేకతో ఆమె ఉలిక్కి పడింది: అది తనకు పరిచిత కంఠమే: ఆ పిలుపులో ఎందుకో కొంత బాధ వ్యక్తమైంది:

'ఎవరది రామూయేనా? రామూ!' అని అంది ఉష ఆశ్చర్యంతో: తడబడుతూ ఆమె కుర్చీలో నుండి లేవబోయింది: అంతటి విషాదపరిస్థితుల్లోనూ ఎందుకో గానీ ఆమెలో ఎక్కడలేని చైతన్య ఉత్సాహాలు ఉప్పెనలా పొంగుకొచ్చాయి:

'ఉషా! లేవకు: కూర్చో: నేను రాంబాబునే: మాటాడే ధ్వనిని బట్టి గ్రుడ్డి వాళ్ళు ఎదుటివ్యక్తిని గుర్తించగలుగుతారనేది నీవు నిజమేనని ఋజువు పరిచావు'

'రామూ, నీవు బ్రతికే ఉన్నావా? మరి మీ అధికారులు నీవు హాస్పిటల్లో మరణించినట్టు తెలియచేశారే!'




దేశమంతటనూ ప్రఖ్యాతి గాంచినవి.

రాయల్ బనియన్లు

* శ్రేష్ఠమైన రకం
* తక్కువ ధర
* చిరకాల మన్నిక
* చక్కని అల్లిక

ఇంటర్‌లాక్ బనియన్లు మా విశిష్టత.

: తయారించువారు :

రాయల్ నిట్టింగ్ కంపెని
తిరుపూరు. (S.I.)

ఏజెంట్లు: శ్రీ వెంకటేశ్వరా టెక్స్టైల్స్ కంపెని, కావలి.

'ఉషా, జరిగిందంతా విచిత్రంగా అగుపిస్తోంది: యుద్ధంలో ఒక రోజున నా కుడికాలికి తుపాకి గుండు తగిలింది. హాస్పిటల్‌లో చేర్చారు: స్మృతి వచ్చాక చూచుకుంటే శస్త్రచికిత్సద్వారా నా కాలు కాస్త తీసేయబడింది: ఆలోచనల్లో పడ్డాను: వాటిల్లో నీవు తలంపుకురాగానే నా గుండె ఝల్లు మంది 'అనురాగ లతలాంటి అందాల ఉషకు అవిటి వాడిగా నేనెల్లా అగుపించటం? అగుపించి ఆమె నిర్మల హృదయంలో గాలివానను సృష్టించటమెందుకు? వైవాహిక జీవితానికి సంబంధించినంతవరకు ఆమె భవిష్యత్తేమవుతుంది?' అని ఆలోచించాను: అన్నిటికీ ఒకటే మార్గం అగుపించించి: నేను కొంతకాలం నీకు అగుపించకుండా ఉండటం:

అల్లా చేస్తే నీవు నన్ను క్రమంగా మరచి మరో వ్యక్తిని వివాహమాడి సుఖంగా జీవిస్తావని అనుకున్నాను కానీ ఇల్లా..ఇల్లా..,దీపావళి నీకు అంధత్వం సంప్రాప్తిస్తుందని, నీ చూపు పోతుందని నేననుకోలేదు. నీ క్షేమం కోరి నేనొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది. మా నాన్న ఈ విషయాలన్నీ చెప్పగానే నాకు విద్యుద్ఘాతానికి గురైనట్టనిపించింది. "రుద్ధకంఠంతో పలికాడు రాంబాబు. కంఠధ్వనివల్ల రాంబాబు వ్యథ చెందుతున్నాడని ఉష క్షణాలమీద తెలుసుకోగలిగింది" కానీ అతడి కన్నీటి స్రవంతిని మాత్రం చూడలేక పోయింది.

"అవును, రామూ! కళ్ళతో కాకరు పువ్వుల కాంతిని చూచి ఆనందించే తరుణంలో విధి వైపరీత్యం కొద్దీ నా కనుచూపు కాస్త హరించుకు పోయింది. రామూ, ఒక వంక దేశం పిలుపునందుకొని అంగవైకల్యం బొందినా, మరోవంక నా క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నాకోసం నీవు చేసిన త్యాగం మహత్తరమైంది. నీవు నా క్షేమం కోరి చేసిన ఆ త్యాగం ఫలించుటమే ఒక విధంగానీ ఆనందానికీ అంతుండేది కాదు కానీ నాకు ఈ కళ్ళుండి, కట్టుకున్నవాడితో కాపురం చేసే వేళలో నిన్ను అవిటి వానిగ చూచినపుడు నేను మరెంత బాధ పడేదాన్నో లేదా నిన్ను చూచీ చూడనట్టు ఎంత నిర్లక్ష్యం చేసే దాన్నో. వీటన్నిటికీ తగ్గట్టు భగవంతుడు నన్ను గ్రుడ్డిదాన్ని చేశాడు" మండి పోతున్న తన కంఠాన్ని ఉష తన రెండు చేతులలోనూ నొక్కిపట్టుకుంది.

"ఉషా, ఏమిటీ పిచ్చి ఊహాలు?"

"ఉష ఈ మాటలకు చిన్నగా నవ్వింది. ఆ నవ్వుతో బాటు జీవం లేని తన లోతైన కళ్ళనుండి జలకణాలను రాల్చింది.

"రామూ, నా ఊహాలు పిచ్చివిగా తోచవచ్చు. నా నవ్వు నీకు పిచ్చి నవ్వుగా అగుపించవచ్చు. కానీ ఇటువంటి త్యాగం చేయగలిగిన నీ అవిటితనాన్ని నేను చూడకూడదనే దేవుడు నా కళ్లలోని కనుపాపలను కాస్త మాయం చేసాడు. రామూ, నీవు సామాన్య మానవుడివి కావు. గుణసంపన్నుడవైన నిన్ను నిర్దయుడయిన ఆ దేవుడు కుంటివాణ్ని చేశాడు. ఎంత ఘోరం!" బావురుమంది ఉష.

"ఉషా!" గట్టిగా కేకేశాడు రాంబాబు బాధగా.

"నీ అభిమానానికి, అవ్యాజానురాగానికి నా గుండె తరుక్కుపోతోంది. ఉషా, లోకంలో కళ్ళుండీ లేనట్టు ప్రవర్తించే వారెందరో ఉండగా, కళ్ళు లేకపోయినా ఉన్నట్టు ప్రవర్తించే నీ వ్యక్తిత్వం ఆదర్శప్రాయమైంది. విధి విధానం ఎంత విచిత్రమైనదో కాకపోతే, గుణం, అందం, ఐశ్వర్యం అన్నీ ఉండి కోరికలననుభవించుకోవలసిన ఓ కోమల హృదయానికీ అఘాతమేమిటి? అర్థం లేని ఈ శిక్ష ఏమిటి?" చిన్న పిల్లాడికి మల్లే విలపించాడు రాంబాబు;

"రామూ, మన జీవిత విపంచులు ఇల్లాంటి అపస్వరాల నొలికిస్తాయని నేనెన్నడూ ఊహించలేదు. అబ్బ; రామూ...రామూ' హఠాత్తుగా అరచింది ఆమె గట్టిగా.

"ఉషా, యేమిటి? యేమైందేమిటి?" రాంబాబు పలుకుతుండగానే పొలం నుండి అప్పుడే తిరిగి వచ్చిన లోకయ్య గదిలోనికి పరుగెత్తుకవచ్చి, కూతుర్ని తన చేతుల్లో పట్టుకొని "ఉషా, యేమ్మా, ఏమైందేమిటి? డాక్టర్ని పిలుస్తానుండు" అని లేవబోయాడు కంగారుగా.

"నాన్నా, చావాలనుకున్నవారిని డాక్టర్లే కాదు, ఆ దేవుడు కూడ రక్షించలేడు. నీవు అనవసరంగా కష్టపడకు" అని తండ్రి ప్రయత్నాన్ని నివారించింది ఉష: తల్లి చేతుల్ని ప్రేమతో స్పృశించి, "రామూ" అని ఒక్కమారు అరచిందామె. ఆ అరుపుతోబాటు ఆమె తన అంతిమ శ్వాసనూ వదిలింది.

"ఉషా!" అని ఒక్క గావు కేకతో ఆమె మృతదేహం మీద వాలిపొయ్యాడు రాంబాబు. అతని శరీరంలో చలనం స్తంభించి పోయింది. లోకయ్య దంపతుల ఆర్తనాదాలతో తనకేమీ సంబంధం లేదన్నట్టు కిటికీ కున్న పరదా గుడ్డ తెగి, గాలికి ఎగిరివచ్చి మృతదేహం వద్ద పడున్న "పొటాషియం సైనైడ్" సీసాను కప్పివేసింది.